సాగునీటి సంఘాల సమరం!

- ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్
- 14న ఎన్నికలు, అదే రోజు ఫలితాలు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలి ఎన్నికలు
- ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితా సిద్ధం
- ప్రతిపాదనలకే పరిమితమైన ఏబీసీ తూము ఏర్పాటు
- 33 సంఘాల పరిధిలో 18,008 మంది ఆయకట్టుదారులు



హాలహర్వి మండలం బాపురం సమీపంలో ప్రవహిస్తున్న ఎల్ఎల్సీ కాలువ,



అస్పరి మండలంలోని వెంగళాయదొడ్డి గ్రామ చెరువు



చిప్పగిరి మండలం బెల్డోణ సచివాలయంలో సాగునీటి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న తహసీల్దార్ ఎజాజ్ అహమ్మద్

ఆలూరు రూరల్/తుగ్గలి: కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత గ్రామ స్థాయిలో మొదటి సారిగా సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. 9 ఏళ్ల క్రితం సాగునీటి సంఘాల ఎన్నికల జరిగాయి. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 14వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. ఆలూరు నియోజకవర్గంలో హెచ్ఎల్సీ,ఎల్ఎల్సీ, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 28 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో ఉన్న ఆయకట్టు రైతుల ఓటరు జాబితాను సిద్ధం చేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

కూటమి సర్కారుకు మొదటి ఎన్నికలు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మొదటిసారి క్షేత్ర స్థాయిలో రైతులకు సంబంధించిన నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానన్న హామీని నెరవేర్చలేదు. రైతులకు పూర్తి స్థాయిలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయలేదు. ఖరీఫ్‌నకు సంబంధించి ధాన్యం కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. వ్యవసాయం అనుబంధ రంగాల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. అలాగే గతేడాది రబీ, ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం నేటికీ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారు. అధికారంలోకి వచ్చి రైతులచ్చిన హామీలు విస్మరించి నిరంతరం రైతులను మోసం చేస్తూ ఇప్పుడు సాగునీటి సంఘాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అన్నదాతలు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

ఆలూరు నియోజకవర్గంలో ఇలా..

ఆలూరు,చిప్పగిరి,హాలహర్వి, హొళగుంద, ఆస్పరి, దేవనకొండ మండలాల్లో మేజర్,మైనర్ విభాగాల్లో 28 సంఘాలను గుర్తించారు. ఆలూరు మండలంలో హెచ్ఎల్సీ పరిధిలో, మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఒక్కో సాగునీటి సంఘం ఉంది. హాలహర్వి మండలం 8 మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉండగా, హొళగుంద మండలం పరిధిలోని ఎల్ఎల్సీ కింద 6, రెండు మైనర్ ఇరిగేషన్ సంఘాలు ఉన్నాయి. ఆస్పరి మండలంలో మైనర్ ఇరిగేషన్ కింద మూడు సంఘాలు, చిప్పగిరి మండలంలో మేజర్ ఇరిగేషన్ కింద 3 సంఘాలున్నాయి. దేవనకొండ మండలంలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 3 సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి 12 మంది టీసీ మెంబర్లను ఎన్నిక జరగనుంది. గెలిచిన టీసీ మెంబర్లందరూ కలిసి వారిలో ఒకరిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.

ప్రతిపాదనలకే పరిమితమైన ఏబీసీ తూము ఏర్పాటు..

ఆలూరు బ్రాంచ్ కెనాల్ (ఏబీసీ) ఆధునీకరించి హంద్రీ కాలువకు తూము ఏర్పాటు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. 1972లో కాలువ నిర్మించారు. హెచ్ఎల్సీ ప్రధాన కాలువ ద్వారా అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలోని కమ్మకొట్టాల వద్ద నుంచి ఉప కాలువగా విడిపోతోంది. చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు మండలాల్లోని 14,265 ఎకరాల ఆయకట్టు ఉంది. 39.4 కి.మీ. పొడువున్న కాలువకు 19 డీపీలు ఉన్నాయి. తవ్విన నాటి నుంచి ఆధునీకరణకు నోచుకోలేదు. హంద్రీకి శాశ్వత తూము ఏర్పాటు చేసి కాలువను ఆధునీకరిస్తే ఆలూరు, చిప్పగిరి,హాలహర్వి మండలాల పరిధిలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. ఈ మూడు మండలాల రైతులు ఏబీసీ కింద ప్రధానంగా మిరప,పత్తి పంటలు సాగుచేస్తారు. హంద్రీ ద్వారా తూము ఏర్పాటు చేస్తే అన్నదాతలు బాగుపడతారు.

33 సంఘాల పరిధిలో 18,008 మంది ఆయకట్టుదారులు

మూడు సార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. డివిజన్‌లోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, దేవనకొండ, కృష్ణగిరి, మద్దికెర, తుగ్గలి, హాలహర్వి మండలాల్లో మొత్తం 33 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ పేరుతో సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా చెరువులు, కాలవల కింద నీటిని వినియోగించుకునే రైతులు ఓటర్లుగా ఉంటూ కమిటీని ఎన్నుకోనున్నారు. డివిజన్‌లో ఈనెల 14వ తేదీన ఎన్నికల నిర్వహణకు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియ ఇలా: ఈనెల 14న సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒక్కో సంఘానికి ఆరుగురి డైరెక్టర్లను నియమించి వారిలో ఒకరి చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఆయకట్టు పరిధిలోని రైతులు మాత్రమే సంఘాలను ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నిక ఏకగ్రీవం కాని పక్షంలో ఓటింగ్ విధానం అమలు చేస్తారు. ఎన్నికలు తహసీల్దార్ల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. డివిజన్‌లో ఎనిమిది మండలాల్లో చెరువులు, కాలవల కింద 33 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. హెచ్ఎల్సీ కింద 6 సంఘాలు, ఎల్ఎల్సీ కింద 2, హెచ్ఎస్ఎస్ఎస్ కింద 3, జీడీపీ కింద 4 సంఘాలకు, 18 చెరువులకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 33 సంఘాల పరిధిలో మొత్తం 18,008 ఆయకట్టుదారులు ఓటర్లుగా ఉన్నారు.

ఆలూరు నియోజకవర్గం వివరాలు..

మైనర్ ఇరిగేషన్ సంఘాలు : 13
మేజర్ ఇరిగేషన్ సంఘాలు : 15
మొత్తం ఆయకట్టు రైతులు : 12,805

మండలం	సాగునీటి సంఘాల సంఖ్య	ఓటర్లు
ఆలూరు	2	687
ఆస్పరి	3	1,533
చిప్పగిరి	3	2,559
హాలహర్వి	9	4,193
హొళగుంద	8	2,856
దేవనకొండ	3	977

ఎన్నికలకు సర్వం సిద్ధం



సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశాం. రెవెన్యూ రికార్డుల్లో పేరున్న ఆయకట్టు రైతులందరూ అర్హులే. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇప్పటికే మేజర్, మైనర్ పరిధిలో టీసీలతో పాటు రైతులను గుర్తించాం. పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేస్తున్నాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.
– గోవింద్ సింగ్,తహసీల్దార్,ఆలూరు

క్లుప్తంగా

కొలతల ప్రకారమే వేతనాలు



కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

మద్దికెర : ప్రభుత్వం నిర్ణయించిన కొలతలు ప్రకారం వేతనాలు మంజూరు చేస్తామని ఉపాధి ఏపీడీ పక్కీరప్ప అన్నారు. గురువారం మండల కేంద్రం పరిసరాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి మస్లర్లు తనిఖీ చేశారు. అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఓ నర్సిరెడ్డి, టీఏ సుధాకర్, ఫీల్డ్అసిస్టెంట్ రాజ్‌కుమార్ ఉన్నారు.

మెనూ అమలు చేయకపోతే చర్యలు

మద్దికెర : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తు న్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి హెచ్చరించారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, 16వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పాఠశాలల్లోనే భోజనం చేసేలా నిర్వాహకులు వంటలు తయారు చేయాలన్నారు. హాజరు శాతాన్ని పెంచడమే గాకుండా ఈ ఏడాది పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలించారు.తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

సౌరవిద్యుత్‌తో కరెంటు బిల్లు ఆదా



అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ ఏడీఈ ఖాజావలి, జెడ్పీటీసీ

మద్దికెర : కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు రాయితీ, రుణాలు అందజేస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ ఖాజావలి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడతూ ప్రతి ఇంటిపై రూఫ్ సోలార్ ప్యానెళ్లు అమర్చుకొని సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తుందన్నారు. దీంతో తక్కువ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందని చెప్పారు. వివరాలకు విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఏఈ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఆవరణలో గురువారం కర్నూలు మెడికవర్ ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా బ్యాంకు మేనేజర్ జానకిరామయ్య వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 65 మందికి ఆస్పత్రి వైద్యులు ఇమ్రాన్ ఈసీజీ, బీపీ, షుగర్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం

తుగ్గలి : ఐక్యంగా ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని మత పెద్దలు సూచించారు. మండల పరిధిలోని హుసేనాపురంలో మసీదులో గురువారం జల్సా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ గౌరవ సలహాదారు సుల్తాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మత పెద్దలు ఆసిఫ్ ఇబ్రహీం, అబ్దుల్ హక్, అమీర్ బాషా హాజరయ్యారు. ఊర్దూ భాషలో ప్రావీణ్యం పొంది వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 40 మంది యువకుల సహకారంతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సుల్తాన్ అన్నారు. అనంతరం మత పెద్దలు ఖురాన్ బోధనలను వినిపించారు.

జర్నలిస్టులపై దాడి హేయం



పత్తికొండలో ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

పత్తికొండ(తుగ్గలి) : సినీ నటుడు మోహన్ బాబు, ఆయన సహాయకులు జర్నలిస్టులపై చేసిన దాడులు హేయమైన చర్యగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు అభివర్ణించారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సాల్‌రంగడు, నాయకులు దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మంచు కుటుంబంలో జరుగుతున్న వ్యవహారాలను కవరేజీ చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబు, అతని సహాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రంగన్న, నాగరాజు, రాజనారాయణగుప్తా, మధుబాబు, వెంకటేశ్వర్లు, పవన్, లక్ష్మీనారాయణ, రాజగోపాల్, నూర్, బద్రి పాల్గొన్నారు.

సుస్థిర లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు, అధికారులు కృషి చేయాలని పత్తికొండ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత, తుగ్గలి ఎంపీడీఓ విశ్వమోహన్ సూచించారు. అభివృద్ధి, సుస్థిర లక్ష్యాల సాధనపై సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం ఎంపీడీఓ కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదరిక నిర్మూలన, గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనకు ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రీయ గ్రామ్ అభియాన్‌పై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పత్తికొండ ఎంపీపీ నారాయణదాసు, తుగ్గలి ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, ఈవోఆర్డీ శ్రీహరి మాట్లాడారు.

ఆలూరు రూరల్: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప, ఎంపీడీఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈఓపీఆర్డీ ప్రభాకర్ ఉద్యోగులకు గురువారం శిక్షణ ఇచ్చారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకరమైన, నీటి సంవృద్ధి, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు కల్పించుకునేలా గ్రామస్తులను చైతన్యం చేయాలని సిబ్బందికి తెలిజేశారు.

చిప్పగిరి: పక్కా ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సర్పంచ్‌లకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు,ఈఓపీఆర్డీ బాలన్న,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హొళగుంద: గ్రామాలభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీఓ విజయలలిత అధికారులు, సర్పంచులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్థానికేతర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్‌డీజీఎస్) అనే అంశం పై ఆయా శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అధికారులకు, సర్పంచ్‌లకు ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కీలకమని ఎంపీడీఓ సుహాసినమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను గుర్తించేందుకు ప్రతి అధికారి గ్రామాల్లో పర్యటించాలన్నారు.



పత్తికొండలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత

కృష్ణగిరిలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు, అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ప్రారంభించారు. గ్రామాల్లో పూర్తిగా మౌళిక సదుపాయాలు కల్పించి, అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ఏవిధంగా తయారు చేయాలనే అంశాలపై రెండు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చిన్నలచ్చప్ప, సూపరింటెండెంట్ రామస్వామి పాల్గొన్నారు.

హాలహర్వి: గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్క అధికారి, ప్రజాప్రతినిధి భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ని జయప్రదం చేయండి

తుగ్గలి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో తలపెట్టిన ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పత్తికొండ ఎంపీపీ నారాయణదాస్, పార్టీ మండల అధ్యక్షుడు కారం నాగరాజు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఎన్నికల ముందు రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా రైతు భరోసా అందించారని, ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే పరిహారం అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా అందేలా అండగా నిలిచిందన్నారు. రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు శుక్రవారం కర్నూలులోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులు, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ: మండలంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి సమస్యలపై రాబోయే రోజుల్లో దశల వారీగా ఉద్యమాలు చేపడతామని సీపీఎం జిల్లా నాయకుడు బి.వీరశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ మండలంలో హంద్రీనీవా పెండింగ్ పనుల నేపథ్యంలో పూర్తిస్థాయిలో రైతాంగానికి సాగునీరు అందడంలేదన్నారు. పంట కాలువల నిర్మాణంపై నాయకులు ప్రజలను మభ్యపెట్టేలా వాగ్దానాలు చేస్తున్నారని మండిపడ్డారు. మండలంలోని పైతట్టు గ్రామాలకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు సాగునీరు ఇవ్వాలన్నారు. 10 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందేలా ఈ ప్రాంతంలో 12 చెరువులకు నీరు ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రెండవ మండల మహాసభల్లో పార్టీ జిల్లా కార్యదర్శి గౌసదేశాయ్, జిల్లా కార్యదర్శి గౌసదేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేవీ నారాయణ ఆధ్వర్యంలో మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వీరశేఖర్, కమిటీ సభ్యులుగా అశోక్, సూరి, యూసుఫ్ బాషా, మహబూబ్‌బాషా ఎన్నికయ్యారు.

అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం

ఆలూరు రూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రైతులు అర్జీలు అందజేశారు.డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, సర్వేయర్ అరుణ జ్యోతి, వీర్వోలు రామాంజనేయులు, మహీంద్ర, లోకవీర ఉన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ కోరారు. గురువారం పందికోనలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 15 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ శ్రీనివాసులు, సర్పంచ్‌లు మంజుల, అనసూయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగవేణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మద్దికెర : రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని మండల ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ పేర్కొన్నారు. గురువారం మద్దికెర తూర్పు రెవెన్యూ గ్రామానికి చెందిన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ సుహాసిని, వీఆర్వోలు శ్రీరాములు, రంగస్వామి, స్వర్ణమ్మ పాల్గొన్నారు.

హొళగుంద: రెవెన్యూ శాఖకు సంబంధించి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నటు తహసీల్దారు సతీష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని హెబ్బటం గ్రామంలో రెవెన్యూ సదస్సులో మొత్తం 22 భూ సమస్యలు, కుల, ఆదాయ తదితర ధ్రువ పత్రాలకు సంబంధించి 38 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. డీటీ నిజాముద్దీన్, ఎండోమెంట్, ఫారెస్ట్ అధికారులు నరేంద్ర, విమల్, వీఆర్‌ఓ లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆలూరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ గోవింద్ సింగ్

కృష్ణగిరి: భూ సమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ కోరారు. కృష్ణగిరిలో గురువారం నిర్వహించిన సదస్సులో 24 దరఖాస్తులు వచ్చాయన్నారు.మండల ప్రత్యేకాధికారి నాగరాజు, వీఆర్వో వెంకటేష్ పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో

వెల్దుర్తి(కృష్ణగిరి): బుక్కాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హాలహర్వి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు, తహసీల్దార్ నజ్మాబాను అన్నారు. గురువారం బిలేహాల్ గ్రామంలో సదస్సు నిర్వహించారు.

20న ఎంపీడీఓ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు

ఆలూరు రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ పరిధిలో.. రూర్బన్ నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 18 దుకాణాలకు ఈ నెల 20వ తేదీన బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుల తీర్మానంతో జెడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన దుకాణాలకు రిజర్వేషన్ల వారీగా లాటరీ పద్ధతిన కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 5 షాపులు బీసీలకు, 3 ఎస్సీలకు, 1 ఎస్టీలకు కేటాయించారు. మిగిలిన 9 షాపులు జనరల్ కేటగిరీకి కేటాయించారు. షాపు నంబర్ 4,8,12,15,18 బీసీలు వేలంలో పాడాల్సి ఉందన్నారు. షాపు నంబర్ 1,11,14 ను ఎస్సీలకు కేటాయించారు. షాపు నంబర్ 5ను లాటరీ పద్ధతిన ఎస్టీలకు కేటాయించినట్లు చెప్పారు. రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. కాంప్లెక్స్‌లో కింద ఉన్న షాపులకు రూ.3 వేలు సర్కారి వారి పాట ఉంటుందని, పైన ఉన్న 9 షాపులకు రూ.2 వేలుగా నిర్ణయించినట్లు చెప్పారు. మండల స్థాయిలో వ్యాపారులు వేలంలో పాల్గొనవచ్చని వెల్లడించారు. పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప,ఏఓ రమాదేవి, ఈఓపీఆర్డీ ప్రభాకర్ ఉన్నారు.



లాటరీ పద్ధతిన రిజర్వేష వారీగా షాపులను కేటాయిస్తున్న అధికారులు

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని ఐదు చిన్న నీటి చెరువుల సాగునీటి సంఘాలకు సంబంధించి శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ గురువారం తెలిపారు. మండలంలోని ఎల్.బండ, వెల్దుర్తి వీరగట్టు, వెల్దుర్తి ఖందాన్, సూదేపల్లె, గోవర్ధనగిరి, నరసాపురం మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఎన్నికలు జరుగుతాయని, ఆయకట్టు రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

కృష్ణగిరి మండలంలో..

మండలంలో నాలుగు మైనర్ ఇరిగేషన్ చెరువులు, జీడీపీ కాలువ కింద, హంద్రీనీవా కాలువ కింద సాగునీటి సంఘాలకు సంబంధించి శనివారం ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఆయా చెరువులు, కాలువల కింద ఆయకట్టు ఉన్న రైతులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయి బాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తుగ్గలి: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులతో ఆయన చర్చించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు శ్రద్ధగా విని ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈవో మాలతి ఉన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

హాలహర్వి: గూళ్యం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్యాధికారి మన్సూర్‌వలి గురువారం వైద్యపరీక్షలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు 4డీ స్క్రీనింగ్ చేశారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు చికిత్స అందించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అబ్రహాం, ఎంఎల్‌హెచ్‌పీ నాగలక్ష్మి, వన్నూరమ్మ, ఏఎన్ఎం లక్ష్మిదేవి పాల్గొన్నారు.





ములుగుందంలోని బీసీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, సీసీ రోడ్డు, డ్రైనేజీ లేని దృశ్యం

డ్రైనేజీ, సీసీరోడ్లు లేక..

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీలు, సీసీరోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు, వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు వీలు లేక ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో కాలనీ వాసులు దుర్గంధం భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల బెడద తీవ్రమైందని, వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. రోడ్డు వేసి కాల్వలు నిర్మించాలని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆలూరు: పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు నారాయణ స్వామి, హనుమంతు, షాకిర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలోని ప్రధాన కూడలి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచితే బాదుడే బాదుడు అంటూ నానా హంగామా చేసి ప్రస్తుతం మీరు చేస్తున్నదేమిటని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత నెలలో వచ్చిన బిల్లు కంటే 40 శాతం ఎక్కుచ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. చార్జీల పెంపును ఉపసంహరించకపోతే ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. కృష్ణమూర్తి, మైనా,వీరన్న,శ్రీను,నాగరాజు,శివ పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులను కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే చర్యలు

ఆలూరు రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడి గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాగునీటి సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం రాత్రి మండలంలోని హత్తిబెళగల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయకట్టు రైతులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేస్తే వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక కస్తూర్బా విద్యాలయ ప్రహరీ నిర్మాణానికి గురువారం మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్ భూమి పూజ చేశారు. రూ.23 లక్షల ఎస్ఎస్ఏ నిధులతో పనులు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ షాకీరాబేగం తెలిపారు. ఈ నిర్మాణంతో విద్యార్థినులకు రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.